ఇసుక ఫిల్టర్లపై అధికారుల దాడులు

యంత్రాలను ధ్వంసం చేయిస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మి

కంది, మార్చి 19: అక్రమ ఇసుక ఫిల్టర్లపై బుధవారం రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. కంది మండలపరిధిలోని చిద్రుప్ప, బ్యాతోల్, ఆరుట్ల గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుక ఫిల్టర్లపై తహసీల్దార్ విజయలక్ష్మి సిబ్బందితో దాడులు నిర్వహించి సామగ్రిని ధ్వంసం చేశారు. ముందస్తు సమాచారం తెలుసుకున్న ఫిల్టర్ల నిర్వాహకులు అక్కడ ఎలాంటి వాహనాలు పెట్టకుండా జాగ్రత్త పడ్డారు. అధికారులు వెళ్లిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఉన్న యంత్రాలను ధ్వంసం చేశారు. అక్రమంగా కృత్రిమ ఇసుకను తయారు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

వట్‌పల్లి : అధిక బరువు కోసం డీసీఎంలో దాచి ఉంచిన బస్తాలు, బాట్లు

పత్తి కొనుగోళ్లలో మోసం

- పత్తి రైతులను తూకంలో మోసం చేసిన దళారులు
- దరఖాస్తుపల్లిలో నష్టపోయిన రైతుల ఆందోళన
- పోలీసులు సైతం దాళరులకే మద్దతు..
- ఎంతో కొంత ఇచ్చి చేతులు దులుపుకుంటున్న దళారులు

వట్‌పల్లి, మార్చి 19: అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన పత్తిని అమ్ముకునే సమయంలో తీవ్రంగా నష్టపోతున్నారు. అమాయక రైతులను ఆసరాగా చేసుకొని వ్యాపారులు, దళారులు తూకాల్లో మోసం చేస్తున్నారు. ఇలాంటి సంఘటనే వట్‌పల్లి మండల పరిధిలోని దరఖాస్తుపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వట్‌పల్లి మండలకేంద్రంలో మహ్మద్ హుస్సేన్ అనే పత్తి వ్యాపారి పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసుకొని అమాయక రైతులకు మోసం చేయడం మొదలు పెట్టారు. రైతులకు మాయమాటలు చెప్పి అధిక ధర ఇస్తానని కొన్నేండ్లుగా పత్తి వ్యాపారం చేస్తున్నారు. వారంరోజులుగా దరుఖాస్తుపల్లిలో పత్తి కొనుగోళ్లు చేశాడు. పత్తి కొనుగోలు కోసం ఖాళీ డీసీఎంను ధర్మకాంటా చేయించి పత్తి లోడు చేసిన అనంతరం మళ్లీ తూకం వేసి రైతులకు పత్తి బరువును తెలిపేవారు. ఈ క్రమంలో మోసం చేసే విధానాన్ని పసిగట్టలేకపోయారు రైతులు. ఖాళీ డీసీఎం తూకం వేసే సమయంలో తూకంలో ఉపయోగించే బాట్లు, నాలుగు ఇసుక బస్తాలతో తూకం వేసేవాడు. సుమారు వాటి బరువు 6 క్వింటాళ్ల వరకు ఉంటుంది. ప్రతి లోడుకు సుమారు రూ.50వేల నుంచి రూ.60 వేల పత్తిని రైతులను మోసం చేశాడు. మంగళవారం దరఖాస్తుపల్లిలో పత్తి కొనుగోలు చేసే క్రమంలో అతడి బాగోతం బట్టబయలైంది. ధర్మకాంటా చేయించుకునే క్రమంలో అందులో ఉంచిన ఇసుక బస్తాలు, తూకం బాట్లను రైతులు పసిగట్టి డీసీఎంను వెంబడించడంతో వ్యాపారి మోసానికి బ్రేకు పడింది. గ్రామానికి చేరుకున్న డీసీఎంను రైతులు తనిఖీ చేయడంతో ఇసుక బస్తాలు, తూకం బాట్లు దొరికేసరికి వ్యాపారికి చెమటలు పట్టాయి. ఆగ్రహంతో రైతులు పోలీసులను ఆశ్రయించినా ఫలితం దక్క లేదు. గ్రామస్తులే వ్యాపారితో మాట్లాడి నష్ట పరిహారం అడిగారు. ఇలాంటి మోసాలు జరిగినప్పుడు పోలీసులు దళారులకు తగిన శిక్ష విధిస్తే మళ్లీ ఇలాంటి మోసాలు జరగకుండా ఉంటాయని గ్రామస్తులు అంటున్నారు.

షెడ్డుపై నుంచి పడి వ్యక్తి మృతి

మునిపల్లి, మార్చి 19: ప్రమాదవశాత్తు రేకుల షెడ్డు పైనుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బుదేరాలో మంగళవార రాత్రి చోటుచేసుకుంది...ఎస్సై రాజేశ్ నాయక్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి...యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన సతీశ్‌కుమార్(28) బుధేరా గ్రామ శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం బుధేరా చౌరస్తాలోని ఓ సిమెంట్ రేకుల షెడ్డు పైకెక్కి షెడ్డుపై మరమ్మతులు చేసే క్రమంలో ప్రమాదవశాత్తు జారి కిందపడిపోగా తలకు బలమైన గాయాలు కావడంతో సంగారెడ్డి బాలాజీ దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వలస కూలీ మృతి

ఝరాసంగం, మార్చి 19: ఆర్థిక ఇబ్బందులు భరించలేక వలస కూలీ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఝరాసంగం ఇన్‌చార్జి ఎస్ఐ సంగమేశ్వర్ తెలిపారు. బీహారు రాష్ట్రం మధుబాని జిల్లా సోహపూర్ గ్రామానికి చెందిన కృష్ణకుమార్(27) రెండు రోజుల కిందట ఝరాసంగం మండల పరిధిలోని గంగాపూర్ గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ వాటర్ ప్లాంటలో కూలీ పని చేసేందుకు భార్యాపిల్లలతో వచ్చాడు. మృతుడి తల్లి, అత్త అనారోగ్యంతో దవాఖానలో చెల్లించిన డబ్బులు, చెల్లెలు పెండ్లి కోసం బ్యాంక్‌లో, ఇతరుల దగ్గర అప్పు చేశాడు. అప్పుల తీర్చలేక మంగళవారం రాత్రి వాటర్ ప్లాంట్‌లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సకుంతిదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ...

హత్నూర, మార్చి 19: హత్నూర మండలం రెడ్డి ఖానాపూర్‌లో మంగళవారం రాత్రి ఇరువర్గాలు ఘర్షణ పడగా పలువురికి తీవ్ర గాయాలై దవాఖానలో చేరారు. గ్రామానికి చెందిన కుమ్మరి ప్రశాంత్ నూతన ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. దానికి అవసరమైన ఇసుక, కంకర, ఇతర సామగ్రి సమీపంలోని మచుకూరి కృష్ణ స్థలంలో నిలువచేసాడు. స్థలం సామగ్రి తీయాలని పలుమార్లు ప్రశాంత్‌కు సూచించినా తీయకపోవడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారితీసింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నచ్చజెప్పారు. బుధవారం ఉదయం మరోసారి దాడులు చేసుకోగా పలువురికి గాయాలయ్యాయి. దీంతో ఒకరిపైఒకరు పోలీస్‌స్టేషనో ఫిర్యాదు చేశారు.

వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- స్వామివారికి సన్నిధిలో పూజలు నిర్వహించిన మాధవానంద సరస్వతి, శివయోగి శివాచార్య మహాస్వామి
- పట్టు వస్త్రాలు సమర్పించిన ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఈవో శశిధర్‌గుప్తా

స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ధర్మకర్తలు

గుమ్మడిదల, మార్చి 19: జిల్లాలోని సుప్రసిద్ధ శైవక్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పన చేశారు. బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ మద్దీ ప్రతాప్‌రెడ్డి, ఈవో శశిధర్ గుప్తా, మాజీ చైర్మన్లు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, సురభీనాగేందర్ గౌడ్, ధర్మకర్తలు కలిసి మహాగణపతి పూజ, నిత్యయాగంతో బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. అర్చక స్వాములకు ఆలయ కమిటీ చైర్మన్ వస్త్రాలు సమర్పించారు. వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్లకు ఆలయ కమిటీ చైర్మన్, ఆలయ ఈవో, గ్రామస్తులు కలిసి భాజాభజంత్రీలతో పట్టువస్త్రాలు సమర్పించారు. ఈనెల 27 వరకు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. రాంపూర్ పీఠాధిపతి మాధవానంద సరస్వతి, తంగడిపల్లి ఆశ్రమ పీఠాధిపతి శివయోగి శివానందమహారాజ్ విశిష్ట అతిథులుగా హాజరై స్వామివారు సన్నిధిలో పూజలు నిర్వహించారు. జూనియర్ అసిస్టెంట్ సోమయ్య, మాజీ ఎంపీటీసీ వేణు, నరేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, జగన్‌మోహన్‌రెడ్డి, ధర్మకర్తలతోపాటు భక్తులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్

నాయకులు సహకరించాలి

జహీరాబాద్, మార్చి 19: ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాయకులు సహకరించాలని ట్రైనీ కలెక్టర్ మనోజ్, జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ ప్రతినిధులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇదివరకు ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, చేర్పులు తదితర వాటి కోసం ఫారం 6,7,8లో దరఖాస్తు చేసుకున్నారని, వాటిని ఈనెల 21వ తేదీలోగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి రాజీకయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు అనుమతులు రద్దు చేయాలి

గుమ్మడిదలలో 43వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న గ్రామస్తులు, రైతు మహిళా జేఏసీ నాయకులు

రాష్ట్ర అటవీశాఖ అధికారికి డంపింగ్ యార్డు రద్దు చేయాలని వినతి పత్రం అందజేస్తున్న నల్లవల్లి రైతు జేఏసీ నాయకులు

గుమ్మడిదల, మార్చి19: డంపింగ్ యార్డు (ఎంఎస్‌బ్ల్యూ)ను రద్దు చేయాలని గుమ్మడిదల, నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్, మంబాపూర్ గ్రామాల్లో రిలే నిరాహార దీక్షలు 43వ రోజుకు చేరుకున్నాయి. బుధవారం మండల కేంద్రంతోపాటు నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో రైతు మహిళా జేఏసీ సభ్యులు దీక్షను చేపట్టారు. ప్యారానగర్, మంబాపూర్ గ్రామాల్లో రిలే నిరాహార దీక్షలను గ్రామస్తులు చేపట్టారు. ఈ సందర్భంగా రైతు జేఏసీ నాయకులు మాట్లాడుతూ..43 రోజులుగా ఆందోళనలు, నిరసనలు, రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరైనది కాదన్నారు. వెంటనే డంపింగ్ యార్డుకు ఇచ్చిన అనుమతులు చట్ట ప్రకారం చెల్లవని తేల్చిచెప్పారు. ఇక్కడి గ్రామాల ప్రజలు యోగక్షేమాలను చూసి రాష్ట్ర ప్రభుత్వం డంపింగ్ యార్డు అనుమతులు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ సర్కారు స్పందించకుంటే ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పుట్ట నర్సింగ్‌రావు, చిమ్ముల నర్సింహారెడ్డి, తులసిదాసు, మందభాస్కర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సీపీఐ బాల్‌రెడ్డి, ఆకుల ఆంజనేయులు, కంజర్ల శ్రీనివాస్, దయానంద్, మల్లేపల్లి ప్రకాశ్, చింతల యాదగిరి, కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్, కుమ్మరి ఆంజనేయులు, కొరివి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారి వినతిపత్రం అందజేత

ప్యారానగర్ డంపింగ్ యార్డును రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ అధికారికి నల్లవల్లి రైతు జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని అటవీ శాఖ కార్యాలయంలో ప్యారానగర్ డంపింగ్ యార్డును రద్దు చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. దీనికి ఆయన స్పందిస్తూ మీరు ఇచ్చిన వినతి పత్రాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. రైతు జేఏసీ నాయకులు మన్నె రామకృష్ణ, కొరివి సురేశ్ తదితరులు ఉన్నారు.

వందశాతం పన్ను వసూలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా

జహీరాబాద్, మార్చి 19: జహీరాబాద్ డివిజన్ పరిధిలోని గ్రామ పంచాయతీల్లో వందశాతం పన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల్లో 90శాతం, రాయికోడ్‌లో 89శాతం, కోహీర్, ఝరాసంగంలో 87శాతం చొప్పున పన్నులు వసూలు జరిగాయన్నారు. ఈనెల 31వ తేదీలోగా వందశాతం పన్నులు వసూలు చేసేలా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వసూళ్లలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ పరిధిలో అనధికార లేఅవుట్ క్రమబద్ధీకరణ చేయడంలో జిల్లాలోనే జహీరాబాద్ డివిజన్ పూర్తిగా వెనుకబడి ఉందన్నారు. క్రమబద్ధీకరణ కోసం 1556 మంది దరఖాస్తు చేసుకుంటే 338 స్టాట్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. రాయికోడ్‌లో 774-60, న్యాల్‌కల్‌లో 333-25, మొగుడంపల్లిలో 275-21, కోహీర్‌లో 143-33, ఝరాసంగంలో 600-75 మంది మాత్రమే రుసం చేల్లించి క్రమబద్ధీకరణ చేసుకున్నారన్నారు. ఈనెల 25వ తేదీలోగా ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి రుసుంలో 25శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. సమావేశంలో డీఎల్‌పీవో అమృత, ఆయా మండలాలకు చెందిన ఎంపీవోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పేరుకే ప్రజా ప్రభుత్వం..ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు

బీఆర్ఎస్వీ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు

ఝరాసంగం, మార్చి 19: ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, నినాదాలను నిషేధిస్తూ అధికారులు జారీ చేసిన సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్వీ నాయకులు మాణిక్యం యాదవ్, శివశంకర్, లాలు, మేదపల్లి మాజీ సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్ డిమాండ్ చేశారు. బుధవారం ఝరాసంగం నుంచి అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న బీఆర్ఎస్వీ నాయకులను, మాజీ సర్పంచులను, ఉప సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి ఝరాసంగం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం పేరుకే ప్రజాపాలన సాగిస్తుందని, ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేస్తుందన్నారు. అప్పట్లో రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దొడ్డిదారిన ఓయూలో నిరసనలు చేయొచ్చు కానీ, ప్రజాస్వామ్య పద్ధతిలో నిరుద్యోగం, విద్య, వైద్యం, నీళ్లు, విధులు, నియామకాలు వంటి సమస్యలపై ప్రశ్నిస్తే విద్యార్థులను అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ ముర్ఖపు చర్య అని మండిపడ్డారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపోతే బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థుల పక్షాన నిలబడి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న యువజన నాయకుడు ప్రవీణ్ రెడ్డి

జిన్నారం, మార్చి 19: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బేరాక చర్చిలో ఆశ్రయం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని బొల్లారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అనిల్ కుమార్ రెడ్డి, యువజన నాయకుడు ప్రవీణ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య బృందం వారికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ... పారిశ్రామికవాడలోని పేద, మధ్యతరగతి వలస కార్మిక కుటుంబాలకు కంటి సంబంధిత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్లద్దాలు అందజేయడం అభినందనీయమన్నారు. శిబిరంలో వైద్యసేవలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ముఖ్యఅతిథులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి పారిశ్రామికవాడలోని ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో పాస్టర్లు జయరాజ్, రవి, శ్రీనివాస్, శేఖర్, వైద్య బృందం సభ్యులు, రోగులు, స్థానికులు పాల్గొన్నారు.

సింగూరులో చిరు వ్యాపారుల దుకాణాలు నేలమట్టం

పుల్కల్, మార్చి 19:సింగూరు ప్రాజెక్టు దిగువన కొన్నేండ్లుగా చేపలు విక్రయించే దుకాణాలను రెవెన్యూ అధికారులు కూల్చేశారు. సింగూరు పర్యాటక కేంద్రంగా ఏర్పాటవుతున్న సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో ప్రాజెక్టు వద్ద దుకాణాలు ఉండరాదని ఆదేశాలు జారీ చేయడంతో ఇదివరకే కొన్ని దుకాణాలను తొలిగించారు. బుధవారం తహసీల్దార్ కృష్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు సిబ్బందితో కలిసి ఇప్పటి వరకు తొలిగించని మరికొన్ని దుకాణాలను జేసీబీతో నేలమట్టం చేశారు. సింగూరు పర్యాటక కేంద్రం అవుతున్న సందర్భంగా మంత్రి చిరు వ్యాపారులకు స్థలం చూపిస్తానని గతంలో హామీ ఇవ్వడంతో దుకాణాలను తొలిగించేందుకు ఒప్పుకున్నారు. మరి చిరు వ్యాపారులకు స్థలం చూపిస్తారూ..లేదా అనేది సందిగ్ధంగా మారింది. ఇచ్చిన మాట ప్రకారం మంత్రి స్థలాలు చూపించాలి లేదం టే మా బతుకులు ఆగమవుతాయని చేపలు విక్రయించే చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆల్పాజోలం, డైజోఫాం పట్టివేత

హత్నూర, మార్చి 19: మహారాష్ట్ర, షోలాపూర్ ప్రాంతాల నుంచి ఇద్దరు వ్యక్తులు నిషేధిత మత్తు పదార్థాలను తీసుకొచ్చి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు బుధవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు తనిఖీలు నిర్వహించి రూ.5లక్షల 50వేల విలువగల ఆల్పాజోలం, డైజోఫామ్‌ను బస్టాప్ సమీపంలోని ఓ ఇంటిలో ప్యాకింగ్ చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మెదక్ జిల్లా నాగులపల్లికి చెందిన రాజుగౌడ్, దుబ్బాక మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన నర్సాగౌడ్ మహారాష్ట్ర షోలాపూర్ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న 503 గ్రాముల ఆల్పాజోలం,17గ్రాముల డైజోఫాం పట్టుకున్నామన్నారు. వారితోపాటు మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో పాల్గొన్ని శ్రీనివాస్‌రావు, వీణారెడ్డి, చంద్రాశేఖర్, గాంధీ, కుమార్, యాదయ్య, అనిల్‌కుమార్, ఖరీం, సతీశ్, మోహన్‌లను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి, మెదక్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సుధాకర్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఝరాసంగం, మార్చి 19:విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల అభివృద్ధి అధికారి సుధాకర్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరుపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...పనిప్రదేశాల్లో తప్పనిసరిగా నీడ పందిళ్లు, ప్రథమ చికిత్స కోసం ఫస్ట్ ఏయిడ్ కిట్లు, కూలీలకు తాగునీరుతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మస్టర్లలో కూలీలు పనికి రాకున్నా హాజరు వేస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఉపాధి కూలీల సంఖ్యను పెంచి వారికి పని కల్పించాలన్నారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా ప్రతిరోజూ పరిశీలించాలని సూచించారు. సమావేశానికి ఏపీవో రాజ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు హాజరయ్యారు.

ప్రతి రైతుకూ యూనికోడ్ కేటాయింపు

- జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద మొగుడంపల్లి మండలాన్ని ఎంపిక చేసిన కేంద్రం
- జహీరాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు భిక్షపతి

సమావేశంలో మాట్లాడుతున్న డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు భిక్షపతి

జహీరాబాద్, మార్చి 19: దేశంలో ప్రతి పౌరుడికి ఆధార్ కార్డుతో గుర్తింపు ఉన్నట్లే ప్రతి రైతుకూ 11 నంబర్లతో కూడిన విశిష్ట సంఖ్య(యూనికోడ్)ను కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని జహీరాబాద్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు భిక్షపతి పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గంలోని మొగుడంపల్లి రైతువేదికలో వ్యవసాయాధికారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయగా, సంగారెడ్డి జిల్లాలోని మొగుడంపల్లి మండలాన్ని ఎంపికచేశారన్నారు. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూయాజమాన్య వివరాలను ఆధార్‌కు అనుసంధానం చేస్తారని చెప్పారు. తద్వారా ఆధార్ కార్డు మాదిరిగానే ప్రతి రైతుకూ 11 నంబర్ల విశిష్ట సంఖ్య(యూనికోడ్) కేటాయించడంతో వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతుకు సంబంధించిన పూర్తి వివరాలు లభిస్తాయన్నారు. భవిష్యత్‌లో పంటల బీమా, పంట రుణాలు, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్మేందుకు తదితర వాటికి ఫార్మర్ ఐడీ కార్డు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మండలంలోని రైతులందరూ తప్పనిసరిగా ఆధార్ కార్డు, పట్టా పాసుపుస్తకం, ఆధార్ కార్డుకు లింకు చేసిన ఫోన్ నంబర్‌తో వ్యవసాయాధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి వివరాలు నమో దు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో వ్యవసాయాధికారులు హసునుద్దీన్, వినోద్‌కుమార్, ఏఈవోలు ప్రవీణ్, భూమేశ్, సరస్వతి, ఖనీజ్, ఆత్మ ఏటీఎం చరణ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికున్ని తొలిగించారని ఆందోళన

కంగ్టి, మార్చి 19: అకారణంగా పంచాయతీ కార్మికున్ని తొలిగించారని కంగ్టి మండలం దెగుల్‌వాడి గ్రామానికి చెందిన ప్రజలు బుధవారం చౌరస్తాలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ఎల్లవేళలా అందుబాటులో ఉండే పంచాయతీ కార్మికుడు శివరాంను ఎలాంటి సమాచారం లేకుండా తొలిగించారని పేర్కొన్నారు. దీంతో గ్రామంలో పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. గ్రామానికి రెండు రోజులకోసారి మిషన్ భగీరథ నీళ్లు సరఫరా కావడంతో ప్రజలు నీటి కోసం నానా అవస్థలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి అకారణంగా తొలిగించిన పంచాయతీ కార్మికుడు శివరాంను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న కమిషనర్

రామచంద్రాపురం, మార్చి 19: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెంచర్‌లో ఖాళీగా ఉన్న స్థలంలో ఓ సంస్థ అక్రమ నిర్మాణాలు చేపడుతుంది. ఈ విషయాన్ని గ్రామస్తులు మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డికి ఫిర్యాదు చేయగా స్పందించిన ఆయన అక్రమ నిర్మాణ పనులను నిలిపివేసి అనుమతులు రద్దు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరు వెంచర్ హెచ్ఎండీఏ అనుమతుల మేరకు నిర్మాణాలు చేసి వినియోగదారులకు అప్పగించారు. అందులో రోడ్డు విస్తరణ కోసం విడిచిపెట్టిన ఖాళీ స్థలం ఉండడంతో అందులో నిర్మాణాలు చేసేందుకు గతంలో మున్సిపల్ అనుమతులు తీసుకున్నప్పటికీ నిర్మాణాలు చేయలేదు..సమయం కూడా దాటిపోవడంతో నోటీసులు ఇచ్చి అనుమతులను రద్దు చేశామని చెప్పారు. ఓపెన్ స్థలంలో నిర్మాణాలు చేసే అవకాశం లేదని, ఒకవేళ నిర్మాణాలు చేస్తే కూల్చివేస్తామని ఆయన హెచ్చరించారు.

రహదారి పనులు ప్రారంభం

రోడ్డు పనులు పరిశీలిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

అమీన్‌పూర్, మార్చి19: అమీన్‌పూర్ నుంచి చందానగర్ రహదారిని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన ర్రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..చక్రపురి కాలనీ నుం